క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు: మైనార్టీ కార్పొరేషన్ నుంచి భూమి ఉన్న మైనార్టీ రైతులకు బర్రెల కొనుగోలు, డైరీ ఫాం ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీ రుణాలు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ రహ్మతుద్దీన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన మైనార్టీ రైతులు ఈ నెల 10 లోపు మీ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లు అందించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొత్తపల్లి: మండలంలోని ముస్లింమైనారిటీ రైతులకు స్వయం ఉపాధి కల్పించడం కార్పొరేషన్ కింద రుణాలు మంజూరు చేస్తున్నామని ఎంపీడీఓ కృష్ణారావు ఓ ప్రకటనలో తెలియజేశారు. అర్హులు 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా 80 శాతం సబ్సిడీతో రూ.2 లక్షల రుణం అందిస్తారన్నారు. ఆసక్తి గల రైతులు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని కోరారు.

రూ.7లక్షలతో సీసీ రోడ్డు పనులు



మక్తల్: మున్సిపాలటీ పరిధిలోని యాదవనగర్‌లో శనివారం రూ.7లక్షల నిధులతో 120 మీటర్ల సీసీ రోడ్డు వేశారు. పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విడతల వారీగా అంతర్గత రోడ్లు వేస్తున్నామని అధికారులు తెలిపారు.

వీధి కుక్కల పట్టివేత



మక్తల్: మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద అధికం కావడంతో భయాందోళన మధ్య బతకాల్సి వస్తోందని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చిన్న పిల్లలు, ఒంటరిగా వెళ్లే వారిపై పలుమార్లు కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటనలు ఉన్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు శనివారం హైదరాబాద్ నుంచి బ్లూ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మక్తల్‌లో కుక్కలను పట్టే కార్యక్రమం చేపట్టారు. వారం రోజులకు ఒకసారి కుక్కలను పట్టుకొని, ఇతర ప్రాంతాలకు తరలిస్తామని కమిషనర్ శంకర్‌నాయక్ తెలిపారు.

విద్యార్థికి అభినందన



మక్తల్: పట్టణంల్‌లోని శ్రీసాయి జ్యోతి పాఠశాలకు చెందిన విద్యార్థి బి.నిశాంత్ హకీంపేట్ క్రీడా పాఠశాలకు ఎంపిక కావడంతో శనివారం రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల, యువజన సర్వీసుల మంత్రి వాకిటి శ్రీహరి విద్యార్థిని అభినందించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వెంకటయ్య, చైర్మన్ నర్సిములు, పీఈటీ రమేష్ తెలిపారు. క్రీడా పాఠశాలలో నిశాంత్ 4వ తరగతిలో ప్రవేశం పొందినట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎం గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవికుమార్, జ్ఞానేశ్వర్, రియాజ్, రోహిత్, గీత, సంతోష్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాలి

నారాయణపేట రూరల్: ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని, అందుకు తెలంగాణ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం నారాయణపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీజేపీ ఓబీసీ మోర్చా ఇందిరా పార్క్ ధర్నా బదులుగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లు పెంచడానికి కేంద్ర ప్రభుత్వంతో ఒత్తిడి పెంచాలని, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఓటు బ్యాంకు రాజకీయాలను మాని బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, కుర్మయ్య, గణేష్, శ్రీనివాస్, గజలప్ప, దత్తు, మాణిక్యప్ప పాల్గొన్నారు.

నేడు భూ నిర్వాసితుల రాస్తారోకో

దామరగిద్ద: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పేట-కొడంగల్ భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో చేపట్టనున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై భూ నిర్వాసితులకు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వం తమకు న్యాయమైన పరిష్కారం చూపే వరకు పోరాటం చేసేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.


జీపీ ట్రాక్టర్ అద్దెకివ్వబడును!



ప్రైవేటు వ్యక్తులకు కిరాయికి పంపిన ఆలంపల్లి పంచాయతీ ట్రాక్టర్

- పంచాయతీల్లో మితిమీరిన అవినీతి
- ఉన్నతాధికారుల అండతోనే దందా కొనసాగుతుందని ఆరోపణ
- ఆలంపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రతి సంతకానికి రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు వసూలు

కృష్ణా: మండలంలోని కొన్ని గ్రామాలు కర్ణాటక సరిహద్దులో ఉండడంతో అక్కడి పంచాయతీ అధికారులు వారు ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా తయారైంది. కొందరు పంచాయతీ కార్యదర్శులు వారానికి ఒక్కసారి అలా గ్రామాలకు వచ్చి వెళ్తున్నారు. అలాంటి వారికి ఉన్నతాధికారుల అండదండలు లభిస్తుండడంతో మారిని ఆపే వారే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఆలంపల్లి పంచాయతీ కార్యదర్శి పంచాయతీ ట్రాక్టర్‌ను గ్రామస్తులకు అద్దెకు రూ.వేలు దండుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదే చోద్యమని స్థానిక యువత ప్రశ్నించగా.. పంచాయతీకి నిధులు లేనందును ట్రాక్టర్‌ను కిరాయికి పంపించి అలా వచ్చిన డబ్బులను గ్రామంలో పనులు చేసేందుకు వాడుతున్నానని సమాధానం చెప్తున్నారని మండిపడుతున్నారు. వారం రోజుల క్రితం ఓ యువకుడు ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసేందుకు పంచాయతీ కార్యదర్శిని సంతకం చేయాలని కోరదంతో అందుకు రూ.3 వేలు అడిగినట్లు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ యువకుడు రూ.1,500 ఇచ్చి సంతకాలు చేయించుకున్నానని వాపోయాడు. ఆయన విధులకు కూడా సక్రమంగా హాజరుకావడం ఆరోపిస్తున్నారు. ఇంత అవినీతి జరుగుతున్నా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హిందుపూర్, తంగిడితో పాటు మరికొన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు సైతం ఇంటి పన్నులు, ఇతర అవసరాలు ఏవి ఉన్నా మొదట డబ్బులు ఇవ్వాల్సిందే డిమాండ్ చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి అవినీతి అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌పే ద్వారా ఇచ్చిన డబ్బులు

డబ్బులిస్తేనే సంతకం..



ఆలంపల్లి పంచాయతీ కార్యదర్శికి డబ్బులు ఇవ్వనిదే ఏ సంతకాలు చేయడు. నాది ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం సంతకం చేయమంటే రూ.3 వేలు అడిగిండు. చివరికి రూ.1,500 ఇవ్వాల్సి వచ్చింది. అలాగే గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను గ్రామంలో కిరాయికి పంపిస్తున్నాడు. దీనిపై ప్రశ్నిస్తే పంచాయతీలో డబ్బులు లేవు.. అందుకే పంపిస్తున్నానని దబాయిస్తున్నాడు. – మహాదేవ్, ఆలంపల్లి

ఎవరిని ఉపేక్షించం

ఆలంపల్లి పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేయిస్తాం. ఎంపీఓ నుంచి నివేదికను తీసుకొని తగు చర్యలు తీసుకుంటాం.
– సుధాకర్‌రెడ్డి, డీఎల్‌పీఓ, నారాయణపేట

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



ఎడివెల్లి పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

మక్తల్: మండలంలోని ముంతన్‌గోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం మై భారత్ జిల్లా కోఆర్డినేటర్ అనిల్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పేరుపై ఒక మొక్క నాటాలని, మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణకు దోహదపడిన వారవుతారని తెలిపారు. ఏక్ పేడ్ మా కేనామ్ అనే కార్యక్రమం చేపట్టి, ఆచరణలో పెట్టిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వరి, శ్రీకాంత్‌రెడ్డి, మమత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని మై భారత్ జిల్లా కోఆర్డినేటర్ అనిల్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ఎడివెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏక్ పేడ్ మాకెనామ్ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి తమ తల్లి పేరు పైన ఒక మొక్కను నాటి పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కల్పన, ఉపాధ్యాయులు నరేష్, ప్రవళిక, అనిత, సోహెల్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మద్దూరు: శ్రావణ మాసం రెండో శనివారాన్ని పురస్కరించుకొని మద్దూరు, నాగంపల్లి, చింతల్‌దిన్నె, అప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని ఆంజనేయ స్వామి, తిరుమలేశుడి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో జల్ది ఊరేగింపులు నిర్వహించారు. పట్టణంలోని బజార్ల ఆంజనేయస్వామి, భూనీడ్ రోడ్డులోని తిరుమలేషుడి ఉత్సవాలు చేయడంతో పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నర్వ: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వాసవీమాతకు ప్రత్యేక పూజలు, వరలక్ష్మీ దేవికి పూజాదికైంకర్యాలు, కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారి చీర వేలం కార్యక్రమం నిర్వహించగా రూ.11,111 కు పల్లెపాటి పావని దక్కించుకున్నారు. కార్యక్రమంలో కొండ మాధవి, ఉపాధ్యక్షురాలు కొండ సౌమ్య, సుప్రజ, శ్రీదేవి, కొండ కళావతి, పల్లెపాటి పావని పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: మండలంలోని అభంగాపూర్ పంచాయతీ నెమళ్లపల్లి గుట్టపై వెలిసిన శ్రీ కనకాద్రి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో శనివారం పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆపదలో మేమున్నామంటూ..

మరికల్: పురిటి నొప్పులతో బాధ పడుతున్న గర్భిణుల పాలిట 108 అంబులెన్స్‌లు వరంలా మారాయి. మండలంలో గడిచిన నెల రోజుల వ్యవధిలోనే నలుగురు గర్భిణుల ప్రసవాలు అంబులెన్స్‌లోనే జరగడం విశేషం. గర్భిణులను ఇంటి నుంచి మండల కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకొచ్చే క్రమంలో వారికి పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి సహజ ప్రసవాలు చేస్తున్నారు. అంతే కాకుండా ఆస్పత్రికి తీసుకొచ్చిన తర్వాత ప్రసవం ఆలస్యం కావడం, ఇతర ఏమైనా సమస్యల కారణంగా గర్భిణులను జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా ఒక్కోసారి అంబులెన్స్‌లో ప్రసవించిన సందర్భాలు ఉన్నాయి. శనివారం ధన్వాడ మండలంలోని చర్లపల్లికి చెందిన గర్భిణి నవీన మరికల్ సమీపంలో అంబులెన్స్‌లో ప్రసవించడానికి సిబ్బంది చేసిన చొరవ మరవలేమంటూ కుటుంబ సభ్యులు కొనియాడారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: తెలంగాణ క్రీడా విధాన ప్రణాళికను ప్రకటించడం రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తుందో కొలమానంగా నిలుస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ నాయకులు శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు మక్తల్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని క్రీడారంగంలో అత్యున్నత స్థాయిలో నిలబెట్టే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని కొనియాడారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాల ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికను తయారు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గణేషకుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, కోళ్ల వెంకటేష్, కట్ట సురేష్, కట్ట వెంకటేష్, గోవర్ధన్, రంజిత్‌రెడ్డి, ఫయాజ్, అంజనేయులు, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

మాగనూర్: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం, విద్య, మెరుగైన మౌలిక వసతులు అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సిబ్బందికి ఆదేశించారు. శనివారం అమ్మపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి రవితో కలిసి ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న పిల్లలు, తల్లులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లల బరువు, ఎత్తులను కొలిచి, మొబైల్ యాప్‌ను పరిశీలించారు.

తల్లి పాలతో బిడ్డకు రక్షణ

తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొత్తపల్లిలో గర్భిణులు, బాలింతలకు అమ్మ పాల విశిష్టత గురించి అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాన్పు అయిన వెంటనే చిన్నారులకు ముర్రుపాలు పట్టించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లలితమ్మ, శాంతమ్మ, నీలమ్మ, ఏఎన్‌ఎం సుధ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభించిన నాయకులు

మరికల్: మండలంలోని ఎలిగండ్లలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం దాతల సహకారంతో వేసిన బోరును శనివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం దాత హరి సహకారంతో బోరు డ్రిల్లింగ్ చేయగా.. పుష్కలమైన నీరు రావడంతో మోటార్‌ను ఏర్పాటు చేసి అందుబాటులోకి తెచ్చారు. ఎలిగండ్ల ప్రజల తాగునీటి సమస్యను తీర్చేందుకు ముందుకు వచ్చిన దాత హరిని కాంగ్రెస్ నాయకులు, ప్రజలు అభినందించారు. చిన్నబాలు, ఎల్లగౌడ్, హన్మంతు, కృష్ణయ్య, హరీశ్, చంద్రాయుడు, శ్రీను, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పేటలో ఉచిత వైద్య శిబిరం

నారాయణపేట రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం గీత మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత కిడ్నీ, మూత్ర సంబంధిత వ్యాధుల వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ప్రఖ్యాత కిడ్నీ శస్త్రచికిత్స నిపుణుడు వివేకానంద్ పర్యవేక్షణలో పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 110 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు ప్రొటీన్స్ ఎక్కువ తీసుకోరాదని, ముఖ్యంగా ఆల్కహాల్ పూర్తి మానేయాలని సూచించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని, అధిక బరువుతోపాటు షుగర్, బీపీని కంట్రోల్లో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత బట్టడ్, డాక్టర్ గీతా విశ్వనాథ్, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ హరినారాయణ్ బట్టడ్, వైద్యులు విశ్వనాథ్, సాయినాథ్, రాధ, సదానంద్ చారి, ఆత్మారాం ఏడీకే, కన్న జగదీశ్, మాల్గన్ జనార్దన్ పాల్గొన్నారు.

12వ వార్డును పట్టించుకోరా..



పామును పట్టుకున్న కాలనీవాసులు

నర్వ: మండల కేంద్రంలోని 12వ వార్డులో పారిశుద్ధ్య పనులు పట్టించుకోరా అని కాలనీ వాసులు వాపోయారు. కొన్ని రోజులుగా కాలనీలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి, డ్రెయినేజీలు లేక, మురుగు నీటితో కాలనీలో విషపురుగులు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. ఇటీవల కాలనీలో పాములు ఎక్కడిక్కడ సంచరిస్తున్నాయన్నారు. శనివారం సాయంత్రం 7 అడుగుల పాము ఇళ్లల్లోకి రావడంతో అందరూ భయందోళనకు గురయ్యామన్నారు. ఈ పరిస్థితుల్లో కాలనీలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రతి రైతు ఎఫ్‌పీఓ సభ్యత్వం చేసుకోవాలి



రైతులకు సభ్యత్వం అందజేస్తున్న అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి

ధన్వాడ: ప్రతి రైతు రూ.2వేలు చెల్లించి రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా చేరాలని ధన్వాడ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి అన్నారు. శనివారం మందిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉత్పత్తిదారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ విండో పరిధిలోని రైతులు 750 మంది సభ్యులుగా చేరితే ప్రభుత్వం రూ.15లక్షల గ్రాంట్, సొసైటీ సభ్యత్వం ద్వారా రూ.15లక్షల గ్రాంట్ కలిపి రూ.30 లక్షలతో కలిపి మరో రూ.కోటి మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ వెంకట్రాములు, రైతులు పాల్గొన్నారు.

‘బీసీల పేరుతో ముస్లింలకు దోచిపెడితే ఊరుకోం’



మాట్లాడుతున్న రఘువీర్‌యాదవ్

ధన్వాడ: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ధన్వాడలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. బీజేపీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ ఎప్పుడు వ్యతిరేకం కాదని, మైనార్టీలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీ అన్యాయం చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. తెలంగాణను చెరబట్టిన రజాకారులు కూడా బీసీల పేరుతో లబ్ధి పొందే అవకాశం ఉందని ఆరోపించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎంత మంది బీసీలకు ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం కల్పించిందో అందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, రాంచంద్రయ్య, ఉదయభాను, మహేష్, రఘు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

4న ఇందిరాపార్కు వద్ద ధర్నా

నారాయణపేట రూరల్: తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా ఈ నెల 4 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బీసీల 42 శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, దీర్ఘకాలికంగా పెండింగ్ పెట్టకుండా పార్లమెంట్‌లో వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సహకరించి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి నిర్వహిస్తున్న నిరాహార దీక్షకు 72 గంటల పాటు జాగృతి వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ కవిత హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కావలి శ్రీధర్, తిరుపతియాదవ్, మైనుద్దీన్, విజయేందర్‌సాగర్, అనూష పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యపై ఆసక్తి పెంచుకోవాలి



పెద్దజట్రం పాఠశాలలో కంప్యూటర్లను ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు గౌరమ్మ

ఊట్కూరు: విద్యార్థులు కంప్యూటర్ విద్యపై ఆసక్తి పెంచుకోవాలని గెజిటెడ్ హెచ్‌ఎం గౌరమ్మ కోరారు. శనివారం పెద్దజట్రం ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో కంప్యూటర్ విద్యపై అవగాహన కలిగించేందుకు ఇటీవల ప్రభుత్వం పది కంప్యూటర్లను పాఠశాలకు కేటాయించిందన్నారు. విద్యార్థులకు బ్యాచ్‌ల వారీగా కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, బాలప్ప, రఘువీర్, వెంకటరాములు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో ధన్వాడ క్రీడాకారులు



నాగలక్ష్మి, గీతను అభినందిస్తున్న రవికుమార్

ధన్వాడ: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ అండర్ 23 విభాగంలో మండల కేంద్రానికి చెందిన నాగలక్ష్మి 55 కేజీల విభాగంలో, 50 కేజీల విభాగంలో గీత బంగారు పతకం సాధించారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది నాగలక్ష్మి, గీత ఆగస్టు 21 నుంచి 24 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రెటరీ రవికుమార్, డీవైఎస్‌ఓ వెంకటేష్‌శెట్టి, సాయినాథ్, రామకృష్ణారెడ్డి, కోచ్ శ్రీనివాసులు క్రీడాకారులను అభినందించారు. జాతీయస్థాయిలో పతకం సాధించాలని ఆకాంక్షించారు.

మహిళా డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించండి



హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేనకు వినతి పత్రం అందిస్తున్న డెవలప్మెంట్ ఫోరం సభ్యులు

కోస్గి రూరల్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించాలని కోరుతూ కోస్గి విద్యావంతుల వేదిక, డెవలప్మెంట్ ఫోరం సభ్యులు కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేనకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం గత విద్యా సంవత్సరం నుంచి కోస్గిలో మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభమైందని అప్పటి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రద్ధ తీసుకోకపోవడం వల్ల అడ్మిషన్లు తగ్గాయని ఆరోపించారు. కళాశాలకు రెగ్యూలర్ ప్రిన్సిపాల్‌ను నియమించి మహిళ విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బద్రీనాథ్, శ్రీకాంత్, క్రాంతి, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

భగీరథ పైప్‌లైన్‌లోకి మురుగు నీరు



తాగునీటి పైపులైన్ వద్ద పేరుకుపోయిన కలుషిత నీరు

మాగనూర్: మండలంలోని కొల్పూర్ గ్రామంలోని పుకట్‌నగర్ కాలనీలో సరఫరా అయ్యే తాగునీటి పైప్‌లైన్‌లో డ్రెయినేజీ నీరు కలుస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరకొరగా వచ్చే తాగునీరు కూడా కలుషితం అవుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. ఇటీవల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ఇలాంటి కలుషిత నీటిని తాగడం వల్ల ఆస్పత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉందని పంచాయతీ కార్యదర్శితో పాటు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజా ప్రభుత్వంలో అందరికీ సంక్షేమం

నర్వ: పదేళ్ల రేషన్‌కార్డులు లేక ఇబ్బందులు పడిన ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రేషన్ కార్డులు మంజూరయ్యాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగన్నగారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాంపూర్‌లో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు వైఎస్‌ఆర్ అందించిన రేషన్‌కార్డులే తప్పా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి ఒక్క రేషన్‌కార్డు అందించిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు అందించే ఏ సంక్షేమ పథకాలు ఆగవన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భట్టుమూర్తి, మాజీ సర్పంచ్ గొసమియ్యా, నాయకులు రాంచంద్రారెడ్డి, కురుమన్న, రవీందర్‌రెడ్డి, బస్వరాజు, బాబుమియ్యా, బాల్‌రెడ్డి, అంజన్న, జైపాల్‌గౌడ్, బాలప్ప, చిన్న అంజన్న, డీలర్ రాములు పాల్గొన్నారు.